జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 2-7-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 385 పేజీలు: 4 వెల: రూ.7

* ఊపిరిపీల్చుకున్న తొమ్మిది మంది పోలీసు అధికారులు
* పదమూడన్నరేళ్ల విచారణకు ముగింపు?
* వీగిపోయిన ముడుపుల ఆరోపణలు
* సాక్ష్యాలు లేవా? విచారణ లోపమా?
* జిల్లాను వణికించిన లిక్కర్ కేసు



# లిక్కర్ సిండికేట్ కేసులో.. క్లీన్ చీట్

**శ్రీకాకుళం క్రైం, జులై 1 (వార్త):** 2012లో శ్రీకాకుళం జిల్లాలో తీవ్ర సంచలనం రేపిన పోలీసుల లిక్కర్ సిండికేట్ మామూళ్ల కేసులో చివరకు 'ఆరోపణలే మిగిలిపోయాయి' అనే స్థాయికి కేసు ముగిసిపోయింది. చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులే లక్షలాది రూపాయలు లంచంగా తీసుకున్నారనే ఆరోపణలపై ఏసీబీ స్వయంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించినా, పదమూడేళ్ల విచారణ అనంతరం "ఆధారాలు లేవు... ఆరోపణలు నిరూపితం కాలేదు! " అని రాష్ట్ర ప్రభుత్వం తేల్చి పారేసింది. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం జీవో 1091 జారీ చేసింది. ఏకంగా తొమ్మిది మంది పోలీసు అధికారులు పూర్తిగా వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపించబడిన ఈ కేసుతో జిల్లా అంతా ఉలిక్కిపడిన రోజులు ఇప్పటికీ ప్రజలకు గుర్తే. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు తనయుడు, తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్, సిండికేట్ కింగ్ ఈశ్వరరావు లాంటివాళ్ళు ఈ కేసుతోనే ముప్పు తిప్పలు కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. వారంతా ఒక ఎత్తైతే.. పోలీసు అధికారులపై లంచాల మచ్చపడినప్పుడు... 'ఈ కేసు ఏవిధంగా పరిణమిస్తుంది?' అనే ఉత్కంఠ ఇన్నాళ్లు నెలకొన్నది. కానీ తాజాగా అందిన ఉత్తర్వులతో అది చరిత్రలో మరో ముసుగు కేసుగా మిగిలిపోయింది. వివరాల్లోకి వెళితే... శ్రీకాకుళం జిల్లా పరిధిలో 2012లో పనిచేసిన 9 మంది పోలీసు అధికారులపై 'లిక్కర్ సిండికేట్' నుంచి ముడుపులు (లంచాలు) వసూలు చేస్తున్నారనే తీవ్ర ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. అప్పట్లో ఈ కేసును ట్రిబ్యునల్ ఫర్ డిసిప్లినరీ ప్రొసీడింగ్స్‌కు అప్పగించారు. సుదీర్ఘంగా సాగిన విచారణకు 13 ఏళ్ల తర్వాత ప్రభుత్వం తాజాగా ముగింపు పలికింది. విచారణకు గురైన అధికారులపై ఎలాంటి ఆరోపణలు నిరూపితం కాలేదని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నో అనుమానాలు, దర్యాప్తులు జరిగినప్పటికీ, చివరకు ఇదంతా కేవలం 'ఆరోపణలుగానే' మిగిలిపోవడం గమనార్హం.

## విచారణకు గురైన అధికారులెవరు?

ఈ కేసులో విచారణ ఎదుర్కొన్న వారిలో ముఖ్యంగా తొమ్మిది మంది అధికారులు ఉన్నారు. కె. శ్రీనివాసరావు (అప్పటి ఎస్ఐ, శ్రీకాకుళం రూరల్, ప్రస్తుతం ఇచాపురం టౌన్ ఎస్ఐ), ఎం.అవతారం (అప్పుడు శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ, ఇప్పుడు సీఐ రణస్థలం), జి.వి. ప్రసాదరావు (అప్పుడు 1టౌన్ సీఐ, ఇప్పుడు పొరుగు జిల్లా డీఎస్పీ), డి.వి.సాగర్ (అప్పటి పాలకొండ డీఎస్పీ, ఇప్పుడు అదనపు ఎస్పీ అడ్మిన్, శ్రీకాకుళం), టి.పానస రెడ్డి (అప్పటి డీఎస్పీ ఇప్పుడు ఆదిలాబాద్ ఓఎస్డి), సిహెచ్.సింహాద్రినాయుడు (అప్పట్లో శ్రీకాకుళం 1టౌన్ ఎస్ఐ ఇప్పుడు వైజాగ్ 4వ పట్టణ ఎస్ఐ), వి.గోపినాథ్ (అప్పట్లో ఎచ్చెర్ల ఎస్ఐ ప్రస్తుతం కాశీబుగ్గ ఎస్ఐ), గోవిందరావు (అప్పటి పొందూరు ఎస్ఐ ప్రస్తుతం సిసిఎస్ (శ్రీకాకుళం), ఎం.వీర కుమార్ (అప్పటి 2టౌన్ సిఐ, ప్రస్తుతం పొరుగు జిల్లా డీఎస్పీ) ఉన్నారు. వీరిలో టి.పనసరెడ్డిపై 2019లోనే చర్యలు ఉపసంహరించుకున్నారు. మిగిలిన వారిపై విచారణ కొనసాగింది.

## విచారణ నివేదిక ఏం చెబుతోంది?

రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఆర్.పి.ఠాకూర్ ఆధ్వర్యంలో కమిషనరేట్ ఆఫ్ ఇన్‌క్వైరీ (సిఓఐ) ఈ కేసును విచారించింది. వారి నివేదికలో "ఆరోపణలు నిరూపించబడలేదు" అని స్పష్టంగా పేర్కొన్నారు. అనుమానాస్పద లావాదేవీలకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదని నివేదిక తెలియజేసింది. దీనిపై అధికారులు కూడా తమపై దాఖలైన ఆరోపణలను ఖండించారు. చివరకు రాష్ట్ర ప్రభుత్వం విచారణా నివేదికల ఆధారంగా మిగిలిన 8 మంది అధికారులపై కూడా చర్యలు ఉపసంహరించుకుంటూ ఉత్తర్వులు జారీ చేసింది.

## అంతుచిక్కని ప్రశ్నలు ఎన్నో?

ఈ కేసు నడిచిన తీరుపై దృష్టి సారిస్తే కొన్ని కీలక ప్రశ్నలు తలెత్తుతాయి. 2012లో ఆరోపణలు వస్తే, విచారణ 2025 నాటికి పూర్తి కావడమేనా? ఈ జాప్యానికి గల కారణాలు ఏమిటి? లిక్కర్ సిండికేట్ ఆరోపణలు వచ్చినప్పుడు స్థానిక రాజకీయ నాయకులు ఎందుకు మౌనంగా ఉన్నారు? ఏసీబీ స్వయంగా తనిఖీలు నిర్వహించినప్పటికీ, ఆ ఆధారాలు విచారణలో ఎందుకు నిలబడలేదు? నిరూపించలేనంత బలహీనంగా సాక్ష్యాధారాలు ఉన్నాయా? లేక విచారణ వ్యవస్థలో లోపాలు ఉన్నాయా? అనేది అంతుచిక్కని ప్రశ్నలుగా మిగిలిపోయాయి.



## జగన్మోహినిగా.. జగన్నాథుడు

**శ్రీకాకుళం, జులై1(వార్త):** జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం నగరంలోని ఇల్లిసిపురంలోని గుండిచా మందిరంలో జగన్నాథ, బలభద్ర, సుభద్రా దేవిలు మంగళవారం భక్తులకు జగన్మోహిని అవతారంలో దర్శనమిచ్చారు. హీరా పంచమి సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలను ఆలయ ప్రధాన అర్చకులు సుభాష్ చంద్ర పండా నిర్వహించారు. లక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని మంగళవారం రాత్రి మేళతాళాలతో జగన్నాథ మందిరం నుంచి గుండిచా మందిరానికి ఊరేగింపుగా తీసుకు వచ్చారు. గుండిచా మందిరం ఆవరణలో మధ్యాహ్నం, రాత్రి పూట భక్తులకు అన్నదానం చేశారు. తొమ్మిది రోజులు పాటు మందిరం ఆవరణలో అన్నదానం కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు బాలు పాణిగ్రాహి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా, ట్రాఫిక్‌కు ఇక్కట్లు కలుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఉద్యోగ విరమణ ఆహ్వానం



శ్రీ పంగ వెంకటేశ్వర రావు,దమయంతి.
రిటైర్డ్ గ్రామ రెవిన్యూ అధికారి
కన్నెవలస

పదవి విరమణ చేసిన సందర్భంగా
మా కుటుంబ సభ్యులకు,బంధువులకు
స్నేహితులకు మరియు నా సహచర ఉద్యోగులకు
నా తరుపున మీ అందరికి
విందు ఏర్పాటు చేయడం జరిగినది.

వేదిక : మేఘన కన్వేషన్ (జమ్ము జంక్షన్)
తేది : 02.07.2025 బుధవారం

ఇట్లు
మీ.....
పంగ వెంకటేశ్వర రావు,దమయంతి.

## నారాయణ సేవలో శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు

**పలాస, జులై 1(వార్త):** రామకృష్ణాపురము సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు, తమ పాకెట్ మనీతో ప్రతీనెల 1వ తారీఖున నారాయణసేవ చేస్తున్నారు. మంగళ వారం స్థానిక గవర్నమెంట్ ఆసుపత్రిలో ఉన్న ఇన్ పేషెంట్స్ కు ఆహారం, స్వామివారి విభూతి, చిత్రపటాన్ని, నారాయణసేవా ఇన్‌చార్జి దాలేటితో కలిసి అందజేశారు.



# అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**-వచ్చే నెల వితంతువులకు నూతన పింఛన్లు**

**-మంత్రి అచ్చెన్నాయుడు**

**- సంతబొమ్మాళిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



**సంతబొమ్మాళి, జులై 1(వార్త):** భర్తను కోల్పోయిన వితంతువులకు నూతన పింఛన్లు మంజూరు చేస్తూ వచ్చే నెలలో ప్రత్యేకంగా పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సంతబొమ్మాళి మండలం ఉమిలాడ గ్రామంలో మంగళవారం జరిగిన "ప్రజాసేవలో ప్రభుత్వం" కార్యక్రమంలో మంత్రి పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఇంపిల్లి పోలమ్మకు ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, మంత్రి అందించారు. అనంతరం రూ.33 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత రహదారులను, రూ.1.67 కోట్లతో నిర్మించిన బీచ్ రోడ్డును మంత్రి ప్రారంభించారు. రూ.57 లక్షల వ్యయంతో చేపట్టనున్న మరికొన్ని రహదారులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో 2019 నుంచి వితంతువులకు పింఛన్లు ఇవ్వడాన్ని నిలిపివేశారని, ఇప్పుడు ప్రభుత్వ హామీ మేరకు మళ్లీ ఆ పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతినెల 1న ఇంటి గుమ్మం వద్దకే పింఛన్లు తీసుకెళ్లి పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు.

**అర్హులందరికీ ఆర్థిక సాయం :**

సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా అర్హులైన ప్రతి మత్స్యకారుడికి రూ.20 వేలు ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేసిందని చెప్పారు. 'తల్లికి వందనం' పథకం కింద ప్రతి కుటుంబంలోని పిల్లలందరికీ ఆర్థిక సాయం అందించామన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు కేంద్రం రూ.2 వేలు ఇచ్చితే, రాష్ట్రం రూ.18 వేలు కలిపి మొత్తం రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తోందన్నారు.

**మూలపేట పోర్టు భవిష్యత్తు అభివృద్ధికి హబ్ :**

మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణం శరవేగంగా కొనసాగుతోందని, పోర్టుకు అనుసంధానంగా పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందని, ఇప్పటికే హల్దియా పెట్రో కెమికల్స్, ఎక్సాంబియల్ అమెరికా సంస్థలతో పాటు మరిన్ని పరిశ్రమలు ముందుకొచ్చాయని చెప్పారు. దీంతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. మూలపేట నుంచి వేములవాడ మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్ట్ వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రెండు నెలల్లో పోర్టు పరిసర ప్రాంతానికి షిప్పు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

**ఉచిత బస్సు ప్రయాణానికి రూ.2400 కోట్లు :**

ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ పథకాన్ని అమలు చేయడంలో ప్రభుత్వానికి ఏడాదికి రూ.2400 కోట్ల భారం ఎదురవుతుందని చెప్పారు. అదే రోజున ఆటో డ్రైవర్లకు కూడా ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

**తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం :**

గ్రామంలో తాగునీటి సమస్యపై స్పందించిన మంత్రి టెక్కలి నియోజకవర్గానికి రూ.600 కోట్లు మంజూరయ్యాయని, వంశధార గొట్ట బ్యారేజ్ నుండి శుద్ధమైన నీటిని ట్యాంకుల ద్వారా ఇంటింటికి అందించేలా ప్రణాళిక రూపొందించామని అన్నారు.

**భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి :**

రాష్ట్రంలో ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయని, ఏడాదిలో వాటి పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ సమిష్టిగా పని చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్, ఆర్డీవో ఎం. కృష్ణమూర్తి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ఎ.సూర్యప్రకాశ్, ఎం.సుధాకర్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ నివారణ మనందరి బాధ్యత : డీఎంహెచ్‌వో




**శ్రీకాకుళం, జులై 1(వార్త):** డెంగ్యూ వ్యాధి నివారణ మాసంగా జులైను పాటించాలని, డెంగ్యూ వ్యాప్తి సీజనల్ కాబట్టి ప్రజలంతా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. కె. అనిత పేర్కొన్నారు. జూలై 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు డెంగ్యూ నివారణ మాసోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఏడు రోడ్డు జంక్షన్ వద్ద వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం పెంచడం, తాగునీటి నిల్వల వద్ద చెత్త తొలగించడం, దోమల వృద్ధి నిరోధక చర్యలు తీసుకోవడం ఒంటి అవగాహన కార్యక్రమాలు చేపడతారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఈ నెల అంతా కార్యక్రమాల నిర్వాహణకు జిల్లా మలేరియా అధికారి పి.వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైందని, ఈ సందర్భంగా ఆరోగ్య శాఖ, మున్సిపల్, గ్రామీణ శాఖల సిబ్బంది సమిష్టిగా డెంగ్యూ వ్యాధిపై అన్నిచోట్ల అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారని అనిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుజాత, డాక్టర్ వెంకటరావు, వెక్టర్ కంట్రోల్ స్పెషలిస్ట్ వెంకటేశ్వరరావు, ఏ ఎన్ ఎం లు, ఆషా వర్కర్లు, పబ్లిక్ హెల్త్ స్టాఫ్, ఎన్విబిడిసిపి విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# కార్గో ఎయిర్‌పోర్టు భూ సర్వేను అడ్డుకున్న రైతులు

**–వెనుదిరిగిన సర్వే సిబ్బంది**

**మందస, జులై 1(వార్త):** మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో ఎయిర్ పోర్టు నిర్మాణానికి భూముల సర్వేకు మంగళవారం వచ్చిన సిబ్బందిని రైతులు అడ్డుకున్నారు. కనీస సమాచారం లేకుండా సర్వే ఎలా చేస్తారని ప్రశ్నించారు. అంతేకాకుండా గ్రామసభ కూడా నిర్వహించలేదన్నారు. సర్వే చేయనివ్వమని రైతులు, స్థానికులు సర్వే సిబ్బందికి చెప్పడంతో వారు వెనుదిరిగారు. ఉద్దానం అభివృద్ధి చెందాలంటే ఇతర ప్రత్యామ్నాలు చూపాలన్నారు. భూములను బలవంతంగా తీసుకుని చేసే కార్గో ఎయిర్ పోర్టును అడ్డుకుంటామని రైతులు తెలిపారు.





## మహిళల సంరక్షణపై అవగాహన

**ఆమదాలవలస, జులై 1(వార్త):** ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రాం అధికారి జలు మూరు రవిబాబు నేతృత్వంలో, పోలీసు సిబ్బంది.. వివిధ రకాల నేరాలు, స్వీయ రక్షణ, మెలకువలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని, యాప్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతికూల పరిస్థితుల్లో ఎలా స్పందించాలో డిజిటల్ ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. విద్యార్థులతో మాక్ డ్రిల్ చేసి చూపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.శ్యామ్ సుందర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, సబ్ ఇనస్పెక్టర్ జి.వాసుదేవరావు, శ్రీకాకుళం శక్తి టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## నల్లబొడ్డులూరులో గ్రామసభ



**మందస, జులై 1(వార్త):** బహాడపల్లి పంచాయతీ నల్లబొడ్డులూరు గ్రామంలో తహసీల్దార్ మిస్క శ్రీకాంత్ సమక్షంలో గ్రామసభ నిర్వహించారు. ఆ గ్రామస్తులు పలుమార్లు పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష దృష్టికి కుల బహిష్కరణ, నల్ల బొడ్డులూరు కొండ ప్రాంతంలో పట్టాలు ఇప్పిస్తామని మాయమాటలను స్థానిక గ్రామ పెద్దలు చెప్పిన విషయమై ఫిర్యాదు చేశారు. తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో తహసీల్దార్ ఈ సభ నిర్వహించారు. గ్రామస్తులు పలువురు తమకి జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, ప్రధాన కార్యదర్శి సాలిన మాధవరావు, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, తమిరి భాస్కరరావు, ముడుముంచి నవీన్ కుమార్, ముంజేటి చంద్రశేఖర్, మంగలపాత్రో, సాలిన జానకిరావు, అందాల గిరి, తామాడ ధర్మారావు, బొడ్డు వాసు, బొడ్డు జగన్నాథ్, సోపింటి కృష్ణారావు, ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కొలిగాం, బెల్లుపడాల్లో పొలం పిలుస్తోంది



**ఇచ్ఛాపురం, జులై 1(వార్త):** కొలిగాం, బెల్లుపడ గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తుంది నిర్వహించారు. పచ్చిగడ్డి విత్తనాల వినియోగం, మట్టిలో కార్బన్ శాతం పెరిగేందుకు, నేల ఉత్పాదకత మెరుగుపడేందుకు పచ్చిసేద్యం ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్ల సహాయంతో తెగుళ్ల నివారణ, ద్రవ ఎరువుల పిచికారీ విధానాన్ని ప్రదర్శించారు. ధాన్యం సాగులో అనుసరించవలసిన నిర్వహణ పద్ధతులు గురించి కూడా వివరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు టి.భవానీశంకరరావు, మండల వ్యవసాయ అధికారి పి.పి.వి.వి. అజయ్‌కుమార్, గ్రామస్థాయి వ్యవసాయ సిబ్బంది, రైతులు, మహిళా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**మందస, జులై 1(వార్త):** బాలిగాంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీ వెళ్తున్న ఉపాధ్యాయులు రౌతు గోవిందరావు, భారతి, పద్మకు గ్రామస్తులు, స్కూల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. స్కూల్ అభివృద్ధిలో వారి పాత్రను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.శేఖర్, హెచ్‌ఎం రత్నాల సోమేశ్వరావు, స్కూలు సిబ్బంది, ఎస్ఎంసీ చైర్మన్ మాదిన స్వాతి, కమిటీ మెంబర్లు, బాలిగాం గ్రామ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పోలీసు డాగ్‌తో విస్తృతంగా తనిఖీలు

**టెక్కలి, జులై 1(వార్త):** జిల్లాలో గంజాయి వంటి మత్తు పదార్థాలు అక్రమ నిల్వలు, క్రయ విక్రయాలు, రవాణా అరికట్టే చర్యలలో భాగంగా మంగళవారం టెక్కలి అర్బన్ పోలీసుస్టేషన్ ఎస్సై రాము.. పోలీసు జాగిలాం కెనైన్ తో అనుమానిత ప్రదేశాలు, రైల్వే స్టేషను, ముఖ్య కూడలి, దుకాణాలు, వాహనాలు తనిఖీలు చేపట్టి, బస్ స్టేషన్ లలో అనుమానం ఉన్న ప్రయాణికులు లగేజి బ్యాగల్ క్షుణ్ణంగా పరిశీలించారు. దుకాణాలు, వాహనాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.





## 10,116 వడలతో ఆంజనేయస్వామికి ఘనంగా అభిషేకం

**-వేలాది మంది భక్తులు హాజరు**

**పలాస, జూలై 1(వార్త):** పలాసలోని ఆంజనేయ స్వామికి 10,116 వడలు(గారెలు)తో మంగళవారం ఘనంగా అభిషేకం జరిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గౌతు శ్యామ్ సుందర్ శివాజీ శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట దువ్వాడ శ్రీకాంత్, కమిటీ పెద్దలు యెదుల దుర్గారావు, కార్యవర్గ సభ్యులు, శ్రీ ఆంజినేయ ట్రాలి రిక్షా-హమాలీ వర్కర్స్ యూనియన్, వివిధ కార్మిక-వర్తక సంఘాలు ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## సుబేదార్ పురుషోత్తంరెడ్డికి ఘన సన్మానం



**ఇచ్ఛాపురం, జులై 1(వార్త):** టి.బరంపురం గ్రామానికి చెందిన తిప్పన పురుషోత్తం రెడ్డి 28 ఏళ్లుగా ఆర్మీ ఉద్యోగం చేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను కుటుంబసభ్యులు, గ్రామస్తులు మంగళవారం ఘనంగా సన్మానించారు. గ్రామ పొలిమేర నుంచి సభా వేదిక వద్దకు ఊరే గించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ బోర పుష్ప, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, ఒడిస్సా పాత్ర పురం బ్లాక్ చైర్మన్ ఎదురు మోహన్ రావు, టి.బరంపురం సర్పంచ్ కారంగి త్రినాథ్ రెడ్డి, బి నౌగం సర్పంచ్ మురపాల టోంకయ్య, మాజీఎంపీపీ మోహన్ రావు, మహతి సాంస్కృతిక కళాశాల సంస్థ అధ్యక్షులు రంగాల జానకి రామ్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు గుణప లక్ష్మణమూర్తి, తిప్పన దాలయ్య, బోరా రామారావు, కాయ భీమ్సేన్, పాతిన వెంకటరావు, పులకల శ్రీరాములు, ధర్మరాజు, చలపరాయి వినోద్ కుమార్, కరగన ఏకాంబరం, లక్ష్మీనారాయణ, దుపనా లక్ష్మీనారాయణ , నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పితాతొళిలో .. వంశధార సాగునీరు సాధన కమిటీ సమావేశం

**మందస, జులై 1(వార్త):** పితాతొళిలో వంశధార సాగునీరు సాధన కమిటి సమావేశం ఈ నెల 2న నిర్వహించబడుతుందని వంశధార సాగునీరు సాధన కమిటి అధ్యక్షుడు మార్పు మన్మధరావు చెప్పారు. రైతులు, గ్రామస్తులతో జరిగే ఈ సమావేశానికి సభ్యులందరూ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. వంశధార సాగునీరు సాధనకై భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక, పోరాటం, రైతుల సహాయ, సహకారాలు తదితర అంశాలపై రైతులతో చర్చిస్తామన్నారు.

## కొనసాగుతున్న డీఈవో తనిఖీలు

**ఇచ్ఛాపురం, జులై 1(వార్త):** జిల్లా విద్యాశాఖధికారి తిరుమల చైతన్య మంగళవారం ఉదయం పురుషోత్తపురం ఏ పి మోడల్ స్కూల్ హాస్టల్, మండల ప్రాథమిక పాఠశాల ముచ్చింద్రను తనిఖీ చేశారు. హాస్టల్ లో అల్పాహారం రుచి చూశారు. విద్యార్థులతో మాట్లాడారు. తరువాత ప్రాథమిక పాఠశాల ముచ్చింద్ర ను ప్రార్థన సమయానికి విజిట్ చేశారు. అక్కడి ఉపాధ్యాయురాలు బి.అరుణకుమారి పిల్లలు కూడా అదే పాఠశాలలో చదువుతున్నారని తెలుసుకుని ఆమెను ప్రశంసించారు. ఆయన వెంట మండల విద్యాశాఖధికారులు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం, ప్రిన్సిపాల్ వైకుంఠరావు ఉన్నారు.



## జోరువానలోనూ.. పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు



**సరుబుజ్జిలి, జులై 1(వార్త):** మూల సవలాపురం గ్రామంలో మంగళవారం ఉదయం ఆరు గంటలకే భారీ వర్షంలో కూడా లబ్ధిదారులు ఇంటి వద్దకు వెళ్లి ఎమ్మెల్యే కూన రవికుమార్ పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతీ పేదవాడి కళ్ళల్లో ఆనందం చూడడం లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యం, మండల పార్టీ అధ్యక్షులు అంబాల రాంబాబు, గ్రామ సర్పంచ్ తర్లాడ రాధాకృష్ణ, సురేంద్ర, పల్లి సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



**శ్రీకాకుళం, జులై 1(వార్త):** ప్రతి పేదవాని కళ్లల్లో ఆనందమే లక్ష్యంగా ప్రభుత్వం పింఛన్ల పంపిణీ చేపడుతోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలోని దమ్మల వీధిలో జోరు వానను లెక్కచేయ కుండా ఆయన స్వయంగా పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దమ్మల వీధిలో రోడ్లను, డ్రైనేజీలను పరిశీలించిన ఎమ్మెల్యే... రూ. 2.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించే సిమెంట్ రోడ్డుకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, మున్సిపల్ ఇంజినీర్లు, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పాతపట్నం, జులై 1(వార్త):** పాతపట్నంలోని దువ్వార వీధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను వివరించారు అలాగే రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇంటి వద్దకే చేరుతాయన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు..



## ఏఐఐఈఏతోనే ఎల్ఐసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం



**పలాస, జులై 1(వార్త):** ఏఐఐఈఏతోనే ఎల్ఐసీ ఉద్యోగుల సమస్య పరిష్కారమవుతున్నాయని ఆ సంఘ అధ్యక్ష కార్యదర్శులు ఎన్.సుబ్బారావు, జె.మాధవరావు అన్నారు. కాశీబుగ్గ ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఏఐఐఈఏ సంఘం 75 వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు జె.మాధవరావు సంఘం పతాకాన్ని ఆవిష్కరించగా సీనియర్ సభ్యులు కరువయ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఎన్. సుబ్బారావు మాట్లాడుతూ ఎల్ఐసీ సంస్థలో శతశాతం ప్రైవేటు పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం ఇవ్వకూడదన్నారు. ఎల్ఐసీ పాలసీలకు జిఎస్టి తొలగించాలని, ఎల్ఐసి సంస్థలో క్లాస్ 3, 4 ఉద్యోగులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలాస ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ టి.బిసాయ్, ఏబీఎంలు రాజా గణపతి, సరేష్, సభ్యులు ఆఘ్నో, చిన్నంనాయుడు, గేదెల మోహన్, వై.కృష్ణ, హైమా తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు దైవంతో సమానం



**సరుబుజ్జిలి, జులై 1(వార్త):** సరుబుజ్జిలిలోని ఆసుపత్రి నందు డాక్టర్స్ డే వేడుకలను మంగవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు సాహితీ ప్రియదర్శిని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవంగా భావించేది ఒక్క డాక్టర్ నేనని గుర్తు చేశారు. హాస్పిటల్ సిబ్బంది ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మోహన్‌రావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**జ్ఞాన భారతిలో ..**

**ఇచ్ఛాపురం, జులై 1(వార్త):** జ్ఞాన భారతి పాఠశాలలో డాక్టర్స్ డే వేడుకలను పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్యనిర్వాహన అధికారి జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ప్రముఖ వైద్యులైన ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పాతిర్ల దేవేందర్ రెడ్డి, డాక్టర్ మట్టా శ్రీనివాస్, డాక్టర్ తిప్పన వెంకటేశ్వర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఐ బి పి, హెడ్ మిస్ట్రెస్ రశీదా సుల్తానా మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.



## 17 వ వార్డులో సీసీ రోడ్డు నిర్మించండి

**ఇచ్ఛాపురం, జులై 1(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో 17వ వార్డులో గల మసీదు పక్కన రహదారి నిర్మించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ రమేష్ కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఆయన త్వరలో ఈ రహదారి పనులు చేపడతామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి జన్నెల సంతోష్. ముస్లిం మైనారిటీ అధ్యక్షులు మహమ్మద్ జిలాని. వార్డు ప్రెసిడెంట్ బుగ్గత వినయ్‌కుమాం, 17వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేసిన మంత్రి

**టెక్కలి, జులై 1(వార్త):** కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు పేర్కొన్నారు. మంగళవారం ఆయన టెక్కలిలో రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం రైతుసంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందని విమర్శించారు. రైతులకు రాయితీపై యంత్రాలను పంపిణీ చేశామని చెప్పారు. శివారు భూములకు కూడా ఈ ఖరీఫ్‌లో పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అన్నదాత సుఖీ భవ పథకం కింద రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తెదేపా ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా ఎమ్మెల్యే మామిడి జన్మదిన వేడుకలు





**మెళియాపుట్టి, జులై 1(వార్త):** పాతపట్నం ఎమ్మెల్యే మావిడి గోవిందరావు జన్మదిన వేడుకలను మెళియాపుట్టిలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రాధాగోవిందస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. మహిళలకు చీరల పంపిణీ చేపట్టారు.

కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నంబాల వెంకటరావు, మాజీ మండలధ్యక్షులు సలాన మోహనరావు, ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


## ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు



**మందస, జులై 1(వార్త):** మందస మండలానికి చెందిన భారతీయ జనతాపార్టీ మండల మాజీ అధ్యక్షుడు పొందర దుదిష్టిపాత్రో పలాస-కాశీబుగ్గలో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. శ్రీఆంజనేయస్వామి అభిషేకం, వేలాది మంది భక్తులతో 10,116 వడలు(గారెలు)తో జరిగిన పవిత్ర కార్యక్రమానికి రామానందస్వామి ఆహ్వానం మేరకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, పెద్దలు పాల్గొనడం ఆనందంగా ఉందని, ఆధ్యాత్మిక కార్యక్రమాలు విజయవంతమయ్యాయని చెప్పారు. ఆయన వెంట డొక్కరి పున్నయ్య ఉన్నారు.

## పార్టీ ఉన్నతికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు

**మెళియాపుట్టి జులై 1 (వార్త):** తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో రేయింబవళ్లు పార్టీ ఉన్నతికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి గౌరవం, గుర్తింపు ఉంటాయని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అధ్యక్షతన మంగళవారం నాడు పాతపట్నంలో వారి నూతన గృహం వద్ద మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. దీంట్లో భాగంగా పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు తెలియజేస్తూనే, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూనే పార్టీ జెండాను మోస్తూ, పనిచేసిన సీనియర్ దేశం పార్టీ కార్యకర్తలను గౌరవించే సందర్భంలో భాగంగా మెళియాపుట్టి మండల కేంద్రానికి చెందిన బస్వ భాస్కర్ రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే మావిడి గోవిందరావు, ఆ పార్టీ కార్యకర్తలు దుస్సాల్వతో సన్మానించారు. పార్టీ సూచనలు సలహాలను పాటిస్తూ క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు తాను సేవలందించగలిగిన పరిస్థితి ఉన్నంతవరకు సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తానని బస్వ భాస్కరరావు తెలియజేసుకుంటూనే, సీనియర్ నాయకులుగా తనకు గుర్తింపునిచ్చి తనను ముందుకు నడిపించే క్రమములో దేశం పార్టీతోపాటు స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు, దేశం పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.





## జన సైనికుడు ఫ్యామిలీకి ఆర్థిక భరోసా

**ఎల్ఎన్‌పేట/హిరమండలం, జులై 1 (వార్త):** ఎల్ఎన్‌పేట మండలం, చిన్న కొల్లివలస ఆర్ఆర్ కాలనీ గ్రామంలో నివసిస్తున్న జన సైనికుడు బూర్లె చిన్నారావు ప్రమాదవశాత్తు ఇటీవల మరణించారు. ఆయన జనసేన క్రియాశీల సభ్యత్వం తీసుకున్నందున పాతపట్నం నియోజవర్గ జనసేన నాయకురాలు కొరికాన భవాని కృషితో ఎమ్మెల్సీ నాగబాబు, జిల్లా సుడా చైర్మన్ కొరికానా రవికుమార్, జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ చేతుల మీదుగా వారి తల్లిదండ్రులకు ఐదు లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో క్రియాశీలక వాలంటీర్ పుట్ట రాజేష్ పాతపట్నం నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## 50 శాతం రాయితీపై పశువుల దాణా పంపిణీ

**మందస, జులై 1(వార్త):** మందసలో ముందస్తుగా నమోదు చేసుకున్న లబ్ధిదారులకి 50శాతం రాయితీపై పశువుల దాణాను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలాస ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మట్ట రవికృష్ణ, మందస, హరిపురం పశువైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతి, మందస మండల ప్రజా ప్రతినిధులు భావన దుర్యోధన, డుంకురు తిరుపతిరావు, తమిరియా భాస్కరరావు, రట్టి లింగరాజు, ఎం.చంద్ర శేఖర్, మజ్జి భాస్కరరావు, మంగళపాత్రో, లబ్బ రుద్రయ్య, గార కృష్ణారావు, మురళి, పసుపురెడ్డి రాము, జుత్తు శంకర్, రుంకు తిరుమలరావు, పాడి రైతులు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలి



**మందస, జులై 1(వార్త):** కొండలోగాం, చినబరంపురంలలో ప్రజా సంఘాలు నాయకులు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈనెల 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్, అఖిల భారత కిసాన్ మహాసభ జిల్లా నాయకుడు మద్దిల రామారావు, ఏఐసిసిటియు జిల్లా నాయకుడు పిన్నింటి నాగేశ్వరరావు, ఐప్వా జిల్లా నాయకురాలు కోనారి ఈశ్వరమ్మ, మందస మండల అధ్యక్ష, కార్యదర్శులు సింహాద్రి, రవి, గౌడ రవి, కోదండు, ఉమా, కాంతారావు, సురేంద్ర, జగ్గారావు, వెంకటరావు, గోవింద్, చక్రపాణి, హడ్డి, మహిమ తదితరులు పాల్గొన్నారు.

## బాలికకు ఆర్థిక సాయం



**మందస, జులై 1(వార్త):** అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ బాలికకు సిక్కోలు ఉద్దానం సేవా సమితి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేసింది. మెళియాపుట్టి మండలం చాపర గ్రామానికి పోలాకి సరస్వతి చేపలు అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తోంది. ఆమె కుమార్తె 9వ తరగతి చదువుతోంది. బాలికకు కడుపులో ప్రేగు సంబంధిత వ్యాధితో చాలా బాధపడుతూ తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో ఉంది. ఆర్థికంగా, మానసికంగా బలహీనమైన స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి సిక్కోలు ఉద్దానం సేవా సమితి ఆధ్వర్యములో 10,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు గణేష్, చిన్నికృష్ణ, తిరుపతి, కిరణ్, శివ, చిన్న, సంతోష్ పాల్గొన్నారు.

## జనరల్ హాస్టల్ పునః ప్రారంభించాలి

**శ్రీకాకుళం, జులై 1(వార్త):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ డిగ్రీ పురుషుల కళాశాల నందు ఉన్న జనరల్ హాస్టల్ను పునః ప్రారంభించి దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు వసతికి ఉపయోగపడేలా చూడాలని జిల్లా కలెక్టర్‌కు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బోర గోపి వినతిపత్రం ఇచ్చారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546